# పరబ్రహ్మం

మధ్యాహ్నం అందింది ఉత్తరం. మొదలయింది మీమాంస. రేపు వచ్చే తమ్ముడినించి తప్పించుకోవాలి. వాడి ప్రశ్నలనుంచి తప్పించుకోవాలి. పదిహేను రోజుల క్రితం నా పనికిమాలిన తనాన్ని నా ముఖాన కొట్టి, తన సుఖాల దోవ తను చూసుకున్న మహాపతివ్రత రహస్యం తెలియనీయకుండా తప్పించుకోవాలి.

కర్తవ్యం గోచరించింది.

ఆచరణే మిగిలింది.

ఇంకెందుకు ఆలస్యం? వేగంగా కదులు! రిక్షా ఎక్కు!

"ఆర్రూపాయలిప్పించు బాబయ్యా"

"నాలుగుమ్ముప్పావలా - పైసా ఎక్కువివ్వను"

"కష్టం మళ్ళుదు బాబయ్యా"

ఒరేయ్ ముసిలి రిక్షావాడా! మళ్ళీ నువ్వు రిక్షా కడతానంటే - మరో గంట పోయాక దొరకను. ఈ ఛాన్సు వదలకు.

"ఎక్కు బాబయ్యా!"

తొక్కు ముసలయ్యా! ఈ తొడతొక్కిడి నుండి వేగంగా వెళ్ళిపోవాలి. వాడు రేపు పొద్దుటే దిగిపోతాడు! 'ఏదిరా అన్నయ్యా - నీ పెళ్లాం?' అంటాడు. 'పోతే పోయిందిలే - నా పిల్లల్ని నీ పిల్లలుగా చూసుకో' అంటాడు. 'నీ పిల్లల్ని నా పిల్లలుగా చూసుకోమనే మహాత్యాగీ - నీ పెళ్లాన్ని నా పెళ్ళాంగా చూసుకోమనగలవా?' అంటాను నేను.

ఇదంతా జరగకూడదు! తప్పుకోండి! తప్పుకోండి. ఎందుకర్రా అలా పరుగెడతారూ? నన్ను చూడండి - శిలువ భుజాన వేసుకుని కూడా ఎంత నిబ్బరంగా వున్నానో! చావు - చాలా సులువు! వెరీ సింపుల్! ఆమెరికావాడిని గిల్లండి! వాడు ఆకాశం మించి మీమీద బాంబుల్ని పోస్తాడు! మీ చచ్చిన శవాల కుప్పల్ని ఫోటోలు తీసి ప్రపంచ మార్కెట్‌లో ప్రకటనలు చేసుకుంటాడు! నాకు అంత టైమ్ లేదు!

"ఒరేయ్ రిక్షావాడా! ఆ తాళ్ళ కొట్టు ముందు ఆపు!"

"ఎంతరా కుర్రాడా - ఈ తాడు?"

"ఏడు రూపాయలండి"

"దూలానికి ఏభై కేజీల బరువు వేలాడదీస్తాను - కాస్తుందా?"

"దూలం సంగతి తెలవదండి - తాడు మాత్రం తెగదండి"

అమ్మ....అమ్మ నా కొడకా - ఎంత జోకేసావురా! నీ బేరగాళ్ళందరిమీదా ఇలా జోకగలవురా - నేను పెళ్లాం లేచిపోయినాడిలా కనిపిస్తున్నానా?

"అయిదుకిస్తావ్‌రా.....అబ్బాయ్...."

"అమ్మా! బేరం వచ్చింది"

తల్లీ రా! నేనూ బేరాన్ని వచ్చాను - రా! బేరాన్ని తెగ్గొట్టు - తెగ్గొట్టడం నీకు కొత్త కాదు తల్లీ! తొమ్మిది నెలల పాటు కడుపులో పెట్టుకున్న సౌందర్యాధిదేవతా - పుట్టీ పుట్టగానే - నీకూ నాకూ వున్న లింకుని తెగ్గొట్టేశావు!

ఏడాది పాటు నా పెదాలకి అనిర్వచనీయ సౌఖ్యాన్నీ, నాలికకి అనుపమానమైన రుచినీ, కడుపులోకి బలమైన ఆహారాన్నీ అలవాటుచేసి నీ స్తనాల నుంచి నన్ను తెగ్గొట్టేశావు! మరోఏడాది తిరగకుండానే నా శరీరానికి మెత్తదనాన్నీ, వెచ్చదనాన్నీ ఇచ్చిన నీ పక్కనుంచి నన్ను తెగ్గొట్టేశావు!

పుట్టక మునుపే నా సౌఖ్యాలను దోచేసి; పుడుతూనే నీ పక్కనుంచి తోసేసి; నా ఒంటరితనాల అయోమయంలో రవ్వంత మార్గం కోసం చేయి చాచి, మీద వేస్తే - ఏడిచి - నాకు తన్నులు ప్రసాదించి, నిన్ను నా నుంచి లాగేసుకున్న నా శత్రువుకి - నిన్ను నువ్వు ముడేసుకుని - నా వినిర్మల బాల్యం నుంచి నన్ను తెగ్గొట్టేసావు!

దుమ్ములో దొర్లి, ధూళిలో పొర్లి, నా వేలు నేను జుబికి, నా పక్క నేను తడుపుకుని, నా శరీర రహస్యాలతో నేను ఆడి, నా ఆనందాల మొక్కలను నేను నాటుకుంటే - వాటి అన్నింటినుంచీ నన్ను తెగ్గొట్టేశావు!

నన్ను స్కూలుకి నెట్టి, నాలుగ్గోడల మధ్యా పెట్టి - పిట్టలనీ, చెట్టులనీ, నీళ్ళనీ, బురదనీ, నా వేళ్ళనీ, నా కాళ్ళనీ నాకు కాకుండా తెగ్గొట్టేశావు!

నీవు నాటిన చోట, నీవు ఆశించిన విధంగా, నేను మొలకెత్తకపోతే - 'నీ ఊహలు ఉపద్రవాలు. నీ ఆనందాలు అపసవ్యాలు. నీ సహజాతాలు సమాజ విరుద్ధాలు. నీ ప్రశ్నలు ప్రకృతి విరుద్ధాలు. నీవు ఎదగాలి. నీ కాళ్ళ మీద నువ్వు నిలబడాలి' అంటూ నన్ను తలక్రిందులుగా నడిపించావు.

దేముళ్ళనీ, భయాలనీ నాకు అంటగట్టి, నా మస్తిష్కాన్ని మరపట్టి, చెక్కబొమ్మగా మలచి, సువిశాల లోకం నుంచి నన్ను విడదీసి, నా స్వంత ప్రపంచ నిర్మాణానికి సత్తువ లేకుండా చేసిన దివ్యసుందర విగ్రహమా! తెగ్గొట్టడం నీకు అలవాటే!

సుశీలలో, సుందరిలో, సూర్యకాంతం అత్తయ్యలో, సుబ్బులు పిన్నిలో నిన్ను నేను వెదుక్కుంటూంటే - నా ప్రయత్నాలను భగ్నం చేసి, నా కలలను వికలం చేసిన అనురాగ

శనిగ్రహమా! తెగ్గొట్టడం నీకు అలవాటే!

నన్ను బజారులో పెట్టి, ధర కట్టించి, తెగ నమ్మిన స్వప్నవ్యాపారీ! నన్ను కొనుక్కున్న అప్పల్నరస ఒడిలో ఒకనాటి నిన్ను నేను వెదుక్కుంటూంటే, తెగిపోయినవన్నీ తిరిగి నేను అతుక్కుంటూంటే, అప్పుడూ కత్తె ఎత్తావు! అప్పల్నరస మనసులో నేను నాటుతున్న విశ్వాసాల మొక్కలు పెరగకుండానే తెగ్గొట్టేశావు తల్లీ!

నువ్వు నాకు దొరకలేదు - దాన్ని నాకు దొరకనీయలేదు - నువ్వు చెక్కి, చెక్కి వదిలేసిన తలతో నువ్వు ఎత్తమని నిర్దేశించిన కైలాస ప్రపంచాన్ని నేను కదపలేకపోయాను - ఓడిపోయిన నన్ను వదిలేసిపోయింది తల్లీ! అప్పల్నరస. ఈ పరాజయ, పరాభవ భావనా ప్రపంచపు ప్రభంజనాన్ని నేను తట్టుకోలేకపోతున్నాను!

మళ్ళీ మళ్ళీ పుడతాను - మళ్ళీ మళ్ళీ నీ స్తనాలను నా స్వంతం చేసుకుంటాను - చెట్టులతో, పిట్టలతో, నీటితో, బురదతో చిత్తమొచ్చినట్లు ఆడతాను - రా తల్లీ! తెగ్గొట్టగల తల్లీ! తెగ్గొట్టడం అలవాటయిన తల్లీ! నా సౌందర్య భావనా ప్రపంచ నిర్మాతా! భావ, భౌతిక ప్రపంచాల వారధీ! నా నిరంతర స్వప్న సామ్రాజ్యమా! ఈ డోలాయమాన క్షణాల వృక్షాల పైకి లంఘించు! ఒక్క వేటున తెగ్గొట్టు!

ఈ బేరాన్ని తెగ్గొట్టు!

ఆమె వచ్చింది. బేరం తెగ్గొట్టింది. నా సమస్త బానిసత్వాలకీ విముక్తినిచ్చే ఈ మెత్తటి తాడుని నాకు అందించింది. తను కేవలం ఆరు రూపాయలు వుంచుకుంది!

పదరా ముసిల్వాడా! అదిగో సెలెక్ట్! అందాకా అవసరంలేదు. ఇదిగో- ఈ ఎడమ వైపు సందులోకి తిరుగు! కుళ్ళు కంపు మొదలయిందికదా! ముసిలి విశాఖలో అదిగో - అదే నా సందు! అదే నా గది! నిజం! నమ్మకం కుదరటంలేదా? ఇదిగో నా జేబులోని తాళంచెవి!

చూశావా! దీనితో ఈ గది ముఖాన వేలాడే కప్ప తెరుచుకుంటుంది. నీకు తెలుసా - ఈ ప్రపంచంలో ప్రతీదీ ఏదో ఒక తాళం చెవితో తెరుచుకుంటుంది. నువ్వు తాళం చెవులను తయారుచేసుకో! వాటికి వ్యవస్థల ఆమోదముద్ర వేయించుకో - వాటిని నీ జేబులో, నీ సంతకంలో, నీ స్వరంలో దాచుకో!

"పావలా చిల్లర లేదు బాబయ్యా"

ఉండదు. నాకు తెలుసు. నన్ను వంచించిన వాళ్ళ జాబితాలో నీ పేరూ చేర్చుకుంటావా - చేర్చుకో! పావలా అన్యాయపు సంపాదనతో ప్రపంచ విజేతవవుదామనుకునే ముసిలి రిక్షావాడా! వెళ్లు! నువ్వు ప్రపంచాన్ని జయించు! నేను బంధాలను త్యజిస్తాను! జీవిత ప్రశ్నలను జయిస్తాను.

పదరా సుబ్బారావ్! నిన్ను నేను నడిపిస్తాను -

గది లోపలికి పద! నీ తాడు మోసుకుని నువ్వే నడువ్! వెయ్యి లైటు! ఏమిటా చీకటి? అప్పల్నరస వదిలిన గుడ్డల చీకటి!

అవును - అదే మీ పడక మంచం! దాని మీదే మొదలయింది మీ ఇద్దరి అన్వేషణ! దానికి కావల్సింది వాళ్ళ నాన్న - నీకు కావల్సింది నీ అమ్మ.

వాళ్ళ నాన్న దానికి అన్నీ అమర్చాడు - జన్మ, గౌన్లు, రిబ్బన్లు, గాజులు, పౌడర్లు, లంగాలు, ఓణీలు, స్కూలు పుస్తకాలు..... చిట్టచివరికి మొగుడు! మొగుడంటే యంత్రం! యంత్రం పని అమర్చటం! అది కిర్రు కిర్రుమనని మంచాన్ని అమర్చాలి. మంచాన్ని వుంచే గదిని సృష్టించాలి. గదిలోకి రాని గాలిని కదిపే ఫానుని అమర్చాలి. తినే బల్లా, కూర్చునే కుర్చీలూ, కట్టుకునే బట్టలూ, వేసుకొనే నగలూ....అడిగినవన్నీ అడగకుండా సృష్టించాలి. పగలు విశ్రాంతినీ - రాత్రి సౌఖ్యాన్నీ అమర్చాలి.

అందుకోసం ఉద్యోగం చెయ్యాలి. వచ్చే ఆదాయం చాలకపోతే బల్ల కింద చేతులు చాపాలి. అందులో ఏమీ రాలకపోతే అదనపు పనులు చేయాలి. చేసి - అలసిపోకూడదు. వచ్చి - మల్లెపూల వాసనలు నింపాలి. నింపి - చిరునగవుల వెలుతురు పంచాలి. తెచ్చిన మల్లెపూలని నలిపి ధ్వంసం చెయ్యాలి. బిగిసిన పిడికిళ్ళు సడలాలి. కళ్ళ వాకిళ్ళలో సంతృప్తుల వసంతాలు విడిది చేయాలి.

యంత్రం విధులన్నీ పకడ్బందీగా, పడక బందీగా వున్నాయి. దానికి అంత సామర్థ్యం లేదు. తప్పు యంత్రానిదా - అమర్చిన వాడిదా?

అప్సల్సరస అలా ప్రశ్నించుకోలేదు.

తన తండ్రిలా నీవు ఆమెను చూసుకోలేదు - అంది.

నా తల్లిలా నువ్వు నన్ను చూసుకోలేదు - అన్నావు.

'తప్పు నీదే - లోపం నీదే' - అంది.

'కాదు - నీదే' అన్నావు.

"ఏం చేస్తానో తెలుసా?" అంది.

'నువ్వూ నేనూ ఏమీ చేయలేం' అన్నావు.

ఆమె చేసి చూపించింది - నువ్వా రోజున ఇంటికి వచ్చేసరికి, తలుపు తట్టేసరికి - నువ్వు గొంతు చించుకునేసరికి - ప్రదర్శన మధ్యలో ఆగిపోయింది. కళాకారుడు పరుగందు కున్నాడు. నువ్వు జయించాల్సిన అనంత ప్రపంచం నీ సామర్థ్యానికి అతీతమయినదన్న నగ్నసత్యం- తన నగ్న శరీరానికి బట్టలు చుట్టుకుంటున్న అప్సల్సరసలో రూపుకట్టింది. సత్యాన్ని భరించలేకపోయావు - రూపాన్ని ధ్వంసించబోయావు.

"నువ్వివ్వలేనిదాన్ని నేను సంపాదించు కుంటున్నాను" అంది అప్సల్సరస.

అలాగే అందా? నీకలా అర్థమయిందా?

ఏమయితేనేం - నీ చాతకానితనాన్ని నీకే వదిలేసి, తనకు చేతనయిన దానితో ప్రపంచాన్ని అందుకునేందుకు వెళ్ళిపోయింది అప్సల్సరస. తనకి అన్నీ అమర్చే తండ్రి కోసం వెళ్ళిపోయింది.

నువ్వు ఏమీ అమర్చకపోయినా ప్రేమించే తల్లి కోసం కలగంటూ మిగిలిపోయావు.

నిజమే! ఆనాడే నీవు చావవలసింది!

ఇంటివాడికి నువ్వు అద్దెవాడివి! హోటలువాడికి నువ్వు కస్టమర్వి! విశాఖపట్నపు మహాయంత్రానికి నువ్వొక అప్రధానమైన భాగానివి! నీకు ఉనికి లేదు! గుర్తింపు లేదు.

నిన్నే గుర్తించని విశాఖ నీ చేతకానితనాన్నీ గుర్తించదు! అందుకే నువ్వు బ్రతికున్నావు. రేపు తెల్లారేసరికి నీ ప్రథమ శత్రువు వస్తాడు. నీ ఓటమికి తన సానుభూతితో ఫ్రేమ్ కడతాడు. దాన్ని పట్టుకెళ్ళి నిన్నెరిగిన సమాజం ముఖాన తగిలిస్తాడు. వాళ్ళు ఎదురుగా 'అయ్యయ్యో' అంటారు. వెనకాతల 'చేతకాని వెధవ' అంటారు.

వద్దు - నువ్వు వాడికి దొరకొద్దు -

వాడుచేసే గౌణ ప్రసంగాలు వినవద్దు -

ఆవేశాన్ని వదులుకోవద్దు -

మీమాంసలు వద్దు -

లేరా నాయనా సుబ్బారావ్! లే! ఆ స్టూలు ఇలా లాగు. దానిపై నిలబడు. తాడు దూర్చు. దూలం అందటంలేదా - కాళ్ళు ఎత్తు. చేతులు సాచు. పిక్కలు నొప్పా? ఆయాసమా? ఫరవాలేదు. భరించు. సాగు. ఇంకొంచెం. ఆఁ! దూరింది కదా తాడు, పడింది కదా ముడి. లాగి చూడు. జారుతోంది కదా తాడు. ఇంకెంత? అయిపోయిందో.

ఏమిటా చీదరింపు?

బొద్దింకను చూసా - దానికి చావటం రాదు. చంపటం రాదు. రెండూ చేయగల సుబ్బారావ్ - కావాలంటే దాన్ని చంపు - ఆ తర్వాత నిన్ను చంపేసుకో.

ఆగకు -ఆలోచించకు - ఆ ముడి పడిందా - ఈ ముడి తెగుతుంది. ఆ తర్వాత సుఖం లేదు - దుఃఖం లేదు - దోమలు లేవు - కంపు లేదు - మళ్ళీ అమ్మ దొరుకుతుంది. జీవిత శిఖరాగ్రాన పూచిన ఒకే ఒక పూవు - బాల్యం దొరుకుతుంది. అమ్మ కమ్మని నిస్వార్థ ప్రేమ అందుతుంది. ఆ పూవు రాలిపోయిననాడే నీవు మరణించావు! ఇన్నాళ్ళూ మోస్తున్నది ఆ శవాన్ని. నువ్విప్పుడు చేయబోతున్నది - దానికి ఖననాన్ని. నువ్విప్పుడు వేస్తున్నది అమ్మ అనిర్వచనీయ అమూల్య సౌఖ్యానికి బీజాన్ని.

ఏమిటా ఆలస్యం?

ఉచ్చు తయారు చేసిన అలసటా! చెమటలు పోశాయా! నాలిక ఆర్చుకుపోయిందా? దాహమా?

పోన్లే వెళ్ళు సుబ్బారావ్! వెళ్లి దాహం తీర్చుకో!

బల్ల దిగాను నేను.

కూజా మీద మూత లేదు. కూజాలో నీళ్ళు లేవు. బొద్దింకలున్నాయి. బిందెలో - బాల్చీలో - నీళ్ళు లేవు.

గ్లాసు విసిరేశాను -

చచ్చేముందు మంచినీళ్ళెందుకు? కనీసం మంచినీళ్ళు కూడా తాగలేనా?

దండెం మీద చొక్కా అందుకున్నాను. తాళమూ, కప్పా తీసుకున్నాను.

ఎందుకింకా తాళమూ, కప్పా?

నడుస్తున్నాను. ప్రశ్నల్ని అణిచేస్తూ దాహం! దాహమా - దాహం తీర్చుకోవాలనే కోరికా? దాహమే! దాహమే! భౌతికావసరమే!

చీకటి తెలుస్తోంది. గాలి తెలుస్తోంది. మునిసిపాలిటీ దీపాల వెలుతురు యుద్ధం తెలుస్తోంది. కాకా హోటలు ముందుభాగంలో నల్లగా, మాసిన బట్టలతో రైలు బొగ్గు పొయ్యి మీద టీ, పాలూ మరగబెడుతున్న మహాకాయం తెలుస్తోంది.

ముక్కు మూసుకుని లోపలికి నడిచాను. కాస్త శుభ్రమైన బల్లను ఎంచుకుని కూర్చున్నాను. మాసిన నిక్కరూ. జిడ్డోడుతున్న బనీనూ కుర్రాడు - "ఏం కావాలి మీకు?" అంటున్నాడు. "నాక్కావాల్సింది గ్లాసుడు నీళ్లు" అన్నాను. వాడు వెళ్ళిపోయాడు. 'నీకు కావల్సింది నీళ్ళేనా - చావు కాదా?' ప్రశ్న మిగిలింది.

వాడు తెచ్చిన నాలుగు సిల్వర్ గ్లాసుల్లోనూ వాడి మురికి వేళ్ళు మునిగి వున్నాయి.

"ఛత్! చెత్త నీళ్ళు" విసురుగా అన్నాను.

వాడు నవ్వాడు. 'ఓరి సుబ్బారావ్! దానం ఇమ్మన్న నీళ్ళకి కూడా పేర్లు పెడతావా? ఒక్క గ్లాసుడు టీ తాగటానికి డబ్బుల్లేని ఘరానా పెద్దమనిషీ' అంటోంది వాడి నవ్వు.

మండిపోయింది.

లేచాను - కడుపు నిండా తింటాను - ఉత్తరం అందినప్పటినుంచీ అన్నం తినలేదు. నీళ్ళు తాగలేదు - చచ్చేముందు చివరిసారిగా కడుపు నిండా తినకూడదా? తినొచ్చు. తినాలి.

ఆఖరు తిండి - ఘుమ ఘుమలాడే పలావా? కర కరలాడే రొయ్యల వేపుడా? చికెనా? మటనా? తలుస్తోంది జిహ్వ! తరుముతోంది జిహ్వ.

నడుస్తున్నాను.

చల చల్లటి గది. నీలి నీలి కాంతి. మత్తు మత్తు సంగీతం. మెత మెత్తటి కుర్చీలు. తెల తెల్లటి సేవకులు. తియ తియ్యటి వినయాలు. వేడి వేడి బువ్వ.

పెదాలు కదుల్తున్నాయి. నాలిక రుచులను పడుతోంది. కడుపు నిండుతోంది. గబ గబా మింగుతున్నాను. పొల మారింది.

'ఎందుకురా తొందరా - మంచినీళ్లు తాగూ' అంటూ నెత్తి మీద తడుతున్న అమ్మ.

గ్లాసుడు చల్లదనమూ కడుపులో వ్యాపించింది.

అవును కదా - మంచినీళ్లు తాగి చద్దామనుకొంటివికదటోయ్ సుబ్బారావూ!

వద్దు. ప్రశ్నలు వద్దు. అసమర్థుల లెక్కలు వద్దు. సమర్థుల ప్రపంచపు సరిహద్దుల కొలతలు వద్దు. అన్నం తిను. అన్నం తిను. అన్నం తిను.

కడుపు నిండింది.

అంత డబ్బున్న హోటలు యజమానీ బల్ల ముందు కూర్చుని ముష్టివాడిలా అడుక్కుంటున్నాడు. వేశాను. దర్జాగా బయటకు నడిచాను.

వీధి సాదరంగా ఆహ్వానిస్తోంది.

గాలి చల్లగా వీస్తోంది. జనాలు చల్లగాలిలో ప్రేమగా భుజం భుజం కలుపుకుని నడుస్తున్నారు. రక రకాల ముఖాలు. ప్రేమించదగ్గ ముఖాలు. ప్రేమించి తీరవలసిన ముఖాలు. శ్రమిస్తున్న ముఖాలు. సమస్త ప్రపంచాన్నీ సృజిస్తున్న ముఖాలు. సహస్ర విషాదాలను అవలీలగా భరిస్తున్న ముఖాలు. శతాబ్దాల నుండి సమాజాలను రచిస్తున్న ముఖాలు. నాగరికతలను మలుస్తున్న ముఖాలు. ఎన్నిసార్లు చూసినా చూడాలనిపించే ముఖాలు.

ఎక్కడికీ జనప్రవాహం?

నాశనంలోకా? మరణంలోకా? కాదు. కాదు.

యుద్ధంలోకా? అవును. అవును.

తిండి తయారీ కోసం యుద్ధం. దాని పంపకం కోసం యుద్ధం. జరుగుతూ జరుగుతూ వున్న యుద్ధం. ఆపలేని యుద్ధం. యుద్ధాలన్నింటినీ ఓడించే యుద్ధం. తిండి యుద్ధం.

నడుస్తున్నాను.

రాజవీధులు వదిలాను. సందులు పట్టాను.

వేశ్యలు - బ్రోకర్లు - రిక్షావాళ్ళు - డ్యూటీలకు వెళ్తూ వస్తున్న కాకీబట్టల పనివాళ్ళు - నిర్విరామ జీవిత యుద్ధ సైనికులు -

తిండి - తిండి - తిండి

కదుల్తున్నాను -

రానీ - రానీ - వస్తే రానీ - కష్టాల్ నష్టాల్ - వస్తే రానీ -

మంచం మీద వాలాను - లైటు ఆర్పాను -

మేడలనూ మిద్దెలనూ తెంచుకుని కిటికీ ఊచలగుండా లోపలికి జొరబడిన చంద్రకిరణం నా కళ్ళను ముద్దాడుతోంది.

వేలాడుతున్న ఉచ్చులో రేపటి భయాలన్నీ ఉరేసుకుంటున్నాయి.

రేపటి ఆనందాలన్నీ స్వప్నాలై మూసుకున్న కనురెప్పల వెనకాల ఊపిరి పోసుకుంటున్నాయి.

అభావ భావ భయాలన్నీ - భౌతికావసరాల ముందు తల దించుకున్నాయి. ●

★ *(స్వాతి సచిత్ర మాసపత్రిక: మార్చి 1994)* ★